## ప్రపంచ జీవ వైవిధ్య సదస్సు

# బడాయి ప్రకటనలు ఆపి, తక్షణ చర్యలు చేపట్టాలి

**ఈజిప్టులో** 'కాప్-27' సమావేశాలు జరిగిన నెలరోజుల తర్వాత, 2022 డిసెంబర్ 6 నుండి 19వ తేదీ వరకు కెనడాలోని మాంట్రెడ్‌లో ప్రపంచ జీవవైవిధ్య సదస్సు (సిబిడి) జరిగింది. చైనా, కెనడాలు సంయుక్తంగా ఈ సదస్సుకు ఆతిధ్యమిచ్చాయి. ఈ సదస్సుకు 196 దేశాల నుండి అధికార ప్రతినిధులతోపాటు, పదివేల మందికి పైగా ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. ప్రధానంగా ఈ జీవ వైవిధ్య సదస్సు 'పర్యావరణయుత' సమస్యల చట్రంలో కొనసాగుతుండటంతో ప్రపంచ నాయకులు, లేదా దేశాల అధినేతలెవరూ ఈ సదస్సుకు హాజరుకాలేదు.

జీవవైవిధ్య వినాశనమనేది వాతావరణ సంక్షోభంలాగా వెనువెంటనే కనబడేది కాదు. అయితే ఈ వినాశనాన్ని ప్రత్యక్షంగా దర్శించలేక పోయినా, దీని బాధితులను మాత్రం స్పష్టంగా చూడగలం. ప్రస్తుత జీవవైవిధ్య వినాశన తీరుపై ఆధాపడి, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం, 34 వేల వృక్షజాతులు, 5200 జంతుజాతులు అంతరించే క్రమంలో వున్నాయి. దీనిలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎనిమిది పక్షి జాతులలోని ఒక జాతి కూడా వుంది. ప్రధాన వ్యవసాయ జంతు జాతులలోని దాదాపు 30 శాతం జాతులు ప్రస్తుతం అంతరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. భూగోళ జీవ వైవిధ్యానికి అడవులు ప్రధాన ఆవాసం కాగా ముఖ్యంగా గత శతాబ్దికాలంలో భూమండలంపైనున్న అసలైన అడవులలో 45 శాతం అంతరించాయి. ఈ విధంగా అడవులు అధికంగా అంతరించిపోతున్న కారణంగా ప్రపంచవ్యాప్తంగా వున్న ఆదిమ తెగల ఆదివాసీ ప్రజానీకపు జీవితాలు చెల్లాచెదురై పోయాయి. వారి ఆవాసాల నుండి, అడవితల్లి ఒడి నుండి వారు విస్థాపనకు గురై, నిరాధారంగా మిగిలిపోతున్నారు. వారి సంస్కృతులు నశిస్తున్నాయి. వారి హక్కులకు రక్షణ లేకుండా పోయింది. అడవులలో నివశించే ఆదిమ తెగల మానవ సమూహాలు నిరాశ్రయులుగా చేయబడటానికి సూపర్ లాభార్జనల కోసం పెట్టుబడిదారుల దురాశే ప్రధాన కారణమనేది నిర్వివాదం. పెట్టుబడిదారీ దేశాలు తమ పశువుల పెంపకం, పశుపోషణ అవసరాల కోసం, వారి ఆహార అలవాట్లు, మాంస వినియోగ అవసరాల కారణంగా అమెజాన్ అడవులను నరికివేస్తుండటం మనం చూస్తున్నాం.

జీవవైవిధ్య వినాశనాన్ని అరికట్టే ఉద్దేశ్యంతో, 2030 నాటికి జీవ వైవిధ్యాన్ని దాని సహజ స్థాయిలకు చేర్చే ఆలోచనతో ఈ జీవ వైవిధ్య సదస్సును నిర్వహిస్తున్నట్లుగా ప్రకటిస్తున్నారు.

భారతదేశం భారీస్థాయిలో అడవుల నరికివేతను వ్యతిరేకిస్తూనే, ఈశాన్య రాష్ట్రాలలో రక్షణ అవసరాలపేరున, భారీ జల విద్యుదుత్పత్తి కేంద్రాల, సువిశాల ప్రధాన రహదారుల అభివృద్ధి పేరుతో అడవుల నరికివేతను భారీగా సాగిస్తోంది. అలాగే అభివృద్ధి పేరిట అండమాన్ నికోబార్ దీవులలో భారీ కంటైనర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం వ్యవసాయ భూములలో అసాధారణ స్థాయిలో పురుగుమందులను పయోగించి చెప్పనలవికాని పర్యావరణ, జీవవైవిధ్య వినాశనానికి పాల్పడుతోంది. కాగా సదస్సులో జీవవైవిధ్య పరిరక్షణకు తానే ఛాంపియన్‌లాగా జపాన్‌తో కలసి ఫోజు పెడ్తున్నది. పురుగు మందుల వాడకాన్ని తగ్గించటం వంటి ప్రతిపాదనలపై కఠినమైన లక్ష్యాలు పెట్టవద్దంటూ జపాన్‌తో గొంతు కలుపుతోంది. జీవవైవిధ్య పరిరక్షణకు వివిధ దేశాలకు వివిధ స్థాయిలలో బాధ్యతలున్నాయని వాదనలు చేసి, మొత్తానికి బడా వ్యవసాయ, వాణిజ్య, పురుగు మందుల కార్పొరేషన్ల ప్రయోజనాల మేరకు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలనే ప్రతిపాదన నిర్ణయ రూపం తీసుకోకుండా జీవ వైవిధ్యానికి హాని తలపెట్టే విధంగా చేయటంలో మనదేశం విజయం సాధించింది. ప్రకృతితో సహజీవనం చేస్తామని, జీవవైవిధ్యాన్ని పరిరక్షించటంలో ఛాంపియన్‌లు తామేనని డాంబికాలు పలికే భారత ప్రభుత్వ పాలకుల వంచన ఈ విధంగా వుంది.

2030 సం॥ నాటికి 30 శాతం భూమి, సముద్రాలను పరిరక్షించాలని ప్రపంచ జీవ వైవిధ్య సదస్సు తీర్మానించింది.

ఈ విధంగా జీవ వైవిధ్య సదస్సు చర్చలు 'ప్యారిస్ మూమెంట్ ఫర్ నేచర్' రూపంలో ముగిశాయి. 2024 సం॥ నాటికి నిర్దిష్ట చర్యలు చేపట్టేందుకు అవసరమైన పథకాలను రూపొందిస్తామని సభ్యదేశాలు అంగీకరించగా, సంపన్నదేశాలు 2030 సం॥ నాటికి ప్రతి సం॥రం 30 బిలియన్ డాలర్లను జీవ వైవిధ్య పరిరక్షణకు వెచ్చిస్తామని అంగీకరించాయి.

అయితే వీరి అంగీకారాలు ఎంతమేరకు ఆచరణరూపం తీసుకుంటాయో వేచి చూడవలసిందే.

ఇప్పుడు చర్చలు, ప్రకటనలు కాదు; నిర్దిష్ట చర్యలు చేపట్టడం అవసరం. అయితే అది సుదూరంగానే వుంది.

*****